ప్రజాశక్తి
బుధవారం 20 సెప్టెంబర్ 2023 5
శ్రీ సత్యసాయి

ఓటర్ల జాబితా తయారీకి చర్యలు

కలెక్టర్ పి.అరుణ్ బాబు

వీడియో కాన్ఫిరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా–2024 తయారీకి అన్ని విధాలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలియజేశారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి మంగళవారం నాడు ఎలక్టోరల్ రోల్స్ – స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటర్ల జాబితాపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం నాడు సమీక్ష నిర్వహించారు. పుట్టపర్తి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధివిధానాల మేరకు జిల్లాలో ప్రణాళికాబద్ధంగా ఓటర్ల జాబితా తయారీకి చర్యలు చేపట్టామన్నారు. పున:పరిశీలన కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం –2024లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి అనర్హుల ఓటర్లకు సంబంధించి 46,869 ఫిర్యాదులు రాగా, ఫిర్యాదులకు సంబంధించి పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు అందించిన ఫిర్యాదుల్లో డెత్ కేసులకు సంబంధించి 7985 పరిశీలన పూర్తి చేశామన్నారు. జిల్లాలో తొలగించిన ప్రతి ఓటునూ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు తెలియజేశారు. ఫారం–6 ఇంకా జిల్లాలో 38 శాతంపెండింగ్‌లో ఉందన్నారు. ఫారం–7లో 72 శాతం పెండింగ్‌లో ఉందన్నారు. ఫారం–8లో 20 శాతం పెండింగ్‌లో ఉందని తెలిపారు. రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఈనెల 20వ తేదీన సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 22వ తేదీన తుది జాబితాను ఎన్నికల కమిషన్ కు సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఆర్ఒలు తిప్పేనాయక్, రాఘవేంద్ర, చిన్నయ్య, ఆయా మండల తహశీల్దార్లు పాల్గొన్నారు.

పంటకు లేదు తడి.. రైతుకంట కన్నీటి జడి..!

◆ వర్షాభావంతో ఎండుతున్న పంటలు
◆ మొక్కలను కాపాడుకునేందుకు రైతుల అవస్థలు

ఉమ్మడి అనంతపురం జిల్లాను ఈ ఏడాది కరువు కమ్మేసింది. కనీసం విత్తనాలు వేసుకునేందుకు కూడా వర్షాలు పడలేదు. పడిన కొద్దిపాటి వర్షానికి వేసిన పంట కూడా వర్షం లేకపోవడంతో ఎండుదశకు చేరుకుంటోంది. దీనిని కాపాడుకునేందుకు రైతులు నానావస్థలు పడుతున్నారు. కళ్లెదుటే వాడిపోతున్న మొక్కలను కాపాడుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. వర్షం జాడలేకపోవడంతో పంటకు తడి అందిచడం కష్టమై రైతుల కంట కన్నీటి సుడులు తిరుతున్నాయి.

మిరప పంటకు డబ్బాలతో నీరు పోస్తున్న కూలీలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఉమ్మడి జిల్లాలో కరువు ఎంతలా కరాళనృత్యం చేస్తోంది అన్న దానికి బొమ్మనహాల్ మండలం బొల్లనగుడ్డం గ్రామంలో రైతులు పడుతున్న ఇబ్బందులు అద్దం పడుతున్నాయి. హెచ్ఎల్‌సికి సాగునీరు అందక దాని పరిసర ప్రాంతంలో సాగు చేసిన మిరప చెట్లు ఎండిపోతున్నాయి. వీటిని కాపాడుకోవడానికి ఒక్కొక్క చెట్టుకు ఒక లీటర్ నీళ్ల డబ్బాలతో తెచ్చి మరీ రైతులు పోస్తున్నారు. ఒక్కో చెట్టు వద్దకెళ్లి డబ్బాతో నీళ్ల పోసి ఆ మొక్కలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ పరిసర ప్రాంతంలో చాలా మంది రైతులు ఇలానే చేస్తూ పంటను కాపాడుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. హెచ్ఎల్‌సి కాలువ నుంచి తొమ్మిదవ డిస్ట్రిబ్యూటరీ చివరి ఆయకట్టుకు 2600 ఎకరాలు సాగుభూమి ఉంది. ఇందులో ఇప్పటి వరకు ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించలేదు. దీనికి తోడు వర్షం కూడా పడలేదు. గత నెలలో కురిసిన కొద్దిపాటి వర్షానికి రైతులు మిరప విత్తనాలు నాటారు. అవి మొలకెత్తాయి. అప్పటినుంచి ఇప్పటివరకు వర్షం రాలేదు.. సాగునీరూ వదల్లేదు. కళ్లెదుటే పంట ఎండిపోతుండడాన్ని తట్టుకోలేక రైతులు కుటుంబ సభ్యులతో కలిసి డబ్బాలతో నీరు పోసే పనికి సిద్ధం అయ్యారు. ప్రతి రైతూ నలుగురు కూలీలు, ఎద్దులు బండిలో డ్రమ్ముల ద్వారా నీటిని తీసుకెళ్లి చెట్లకు నీరు పోసే పనులు చేస్తున్నారు. ఒక మొక్కకు ఒక లీటర్ వంతున నీరువేస్తూ వాటిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ఖర్చుతో కూడుకున్న పని అయినా ఇంతకంటే వేరేదారిలేక తమ శక్తినంతా దారిపోసి మొక్కలను కాపాడే ప్రయత్నం చేస్తున్నామంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంటను కాపాడుకోవాలని..

గత నెలలో వచ్చిన కొద్దిపాటి వర్షానికి హెచ్ఎల్సీ కింద రెండు ఎకరాల్లో మిరప పంటను సాగు చేశాను. విత్తనం వేసినప్పటి నుంచి వర్షం రాలేదు. హెచ్ఎల్సీకి సాగు నీరు కూడా వదల్లేదు. దీంతో పంటలు ఎండుదశకు చేరుకున్నాయి. చేసేది లేక ప్రతి రోజూ కూలీలను తీసుకొచ్చి డబ్బాలతో మొక్కలకు నీరు పోయిస్తున్నాను. అధికారులు సాగునీటి విడుదలపై స్పష్టతను ఇవ్వడం లేదు. పరిస్థితి ఇలానే ఉంటే ఈ ప్రాంతంలో రైతులు తీవ్రంగా నష్టపోతారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సాగునీటి విడుదలకు చర్యలు తీసుకోవాలి.

మారన్న, రైతు, బొల్లనగుడ్డం గ్రామం.

తగినంత సాగునీరు లేదు

హెచ్ఎల్సీకి ప్రస్తుతం తగినంత సాగునీరు లేదు. దీంతో ఉన్నతాధికారులు సాగునీటిని విడుదల చేయడం లేదు. వర్షం లోటు కూడా ఉండడంతో కొంత రైతులకు ఇబ్బంది ఉంది. నీటి లభ్యత మొదలవ్వగానే సాగునీటిని విడుదల చేస్తాం.

మద్దిలేటి, హెచ్ఎల్‌సి, డిఇ.

నేడు గోరంట్లలో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

గోరంట్లలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని బుధవారం నాడు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.అరుణ బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోరంట్ల మండల కాంప్లెక్స్ వెలుగు కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. గోరంట్ల మండల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

తండ్రి అవినీతిలో తనయుడి హస్తం : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

తండ్రి అవినీతిలో ఆయన తనయుడు లోకేష్ హస్తం ఉందని వైసిపి ఇన్‌ఛార్జి దీపిక ఆరోపించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గోదావరి పుష్కరాలలో చంద్రబాబు నాయుడు తన పబ్లిసిటీ కోసం రాజమండ్రిలో 29 మందిని పొట్టన పెట్టుకున్నారన్నారు, కందుకూరులో చంద్రబాబు నిర్వహించిన రోడ్ షోలో 8 మంది అమాయక ప్రజలను పొట్టన పెట్టుకున్నారన్నారు. ఏ రోజైనా వారి ఆత్మలకు శాంతి కలగాలని ఇలా కొవ్వొత్తుల ర్యాలీలు చేశారా అని ప్రశ్నించారు. అవినీతి కేసులో అరెస్టు అయిన బాబు కోసం కొవ్వొత్తులు, కాగడాల ప్రదర్శన చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రజల సొమ్ము దోచేసి, ఆధారాలతో సహా అడ్డంగా దొరికి న్యాయస్థానం ముందు దోషిగా నిలబెడితే న్యాయస్థానం రిమాండ్ విధించిందన్నారు. తన రాజకీయ స్వార్థం కోసం పిల్లనిచ్చిన మామకే వెన్నుపోటు పొడిచిన ఘనుడు చంద్రబాబు అని వ్యాఖ్యానించారు. టిడిపి నాయకులు రిలే నిరాహార దీక్షలు చేయడాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. చంద్రబాబుకు దత్తపుత్రుడుగా వ్యవహరిస్తున్న పవన్ కళ్యాణ్ సొంత కొడుకు కన్నా ఎక్కువగా స్పందిస్తున్నారని విమర్శించారు. లోకేష్ కూడా కచ్చితంగా అవినీతి కేసుల్లో అరెస్టు అవుతారని జోస్యం చెప్పారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి కదిరి అర్బన్

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని స్థానిక ఎమ్మెల్యే పివి. సిద్ధారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ అధికారులతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పనులపై మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఇది వరకే గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం పూర్తి అయిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 27 సచివాలయాలకు ప్రతి సచివాలయానికి కూడా రూ.20 లక్షల రూపాయలు విడుదలయ్యాయన్నారు. రూ. 5.40 కోట్ల రూపాయలతో మున్సిపాలిటీలో పనులను ఇదివరకే చేపట్టామన్నారు. కొన్ని సచివాలయ పరిధిలో పనులు కూడా పూర్తి చేశామని తెలిపారు. పనులు పూర్తి అయిన వాటి బిల్లులను అప్లోడ్ చేయడం పూర్తి చేయాలన్నారు. వార్డులలో పనులు ప్రారంభం కానిచోట త్వరగా ప్రారంభింపజేయాలన్నారు. బిల్లులు అప్లోడ్ చేయడంలో ఇబ్బందులు ఉన్నాయని తమ దృష్టికి వచ్చిందని పంచాయతీరాజ్ వారితో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్‌తో పాటు మున్సిపల్ కమిషనర్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనవసర విమర్శలు మానండి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడిపైనా, ఆయన కుటుంబసభ్యులపైనా, మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల పైనా విమర్శలు గుప్పించడం ఎమ్మెల్యేకు తగదని గోనుగుంట్ల అనుచరులు అన్నారు. గోనుగుంట్ల వ్యక్తిగత కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.. చంద్రబాబునాయుడును విమర్శలు చేస్తే చూస్తు ఊరుకోమన్నారు. తమ నాయకుడు గోనుగుంట్లను పార్టీ మారాడని విమర్శలు చేస్తున్నారని ప్రస్తుత ఎమ్మెల్యే పార్టీమారలేదా అని ప్రశ్నించారు. 2014లో గోనుగుంట్ల సూర్యనారాయణ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక నియోజవర్గం ఐదేళ్లపాటు ఎటువంటి ఫ్యాక్షన్ లేకుండా ప్రశాంతంగా ఉందన్నారు. ఇప్పటికైన వయస్సుకు ప్రాధాన్యత ఇచ్చి మాట్లాడటం నేర్చుకోవాలని వారు హితవుపలికారు. ఈ సమావేశంలో గోనుగుంట్ల అనుచరులు చిగిచెర్ల అరవిందరెడ్డి, గొట్లూరు చంద్ర, తుంపర్తిపరమేశ్, చిలకంసూర్యనారాయణరెడ్డి, నారాయణస్వామి, నబీరసూల్, బోడగల గిరిధర్, దుస్సాక్రిష్ణ, దస్తగిరి, రాప్తాటి రాము పాల్గొన్నారు.

నిమజ్జనానికి పటిష్ట భద్రత

పుట్టపర్తి రూరల్ : వినాయక విగ్రహ నిమజ్జనానికి జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీసు భద్రతా ఏర్పాట్లు చేశామని ఎస్పీ మాధవ్ రెడ్డి తెలిపారు. వినాయక చవితిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా, 2,380 విగ్రహాలను ఏర్పాటు చేశారన్నారు. బుధవారంకొన్ని ప్రాంతాలలో 1500 విగ్రహాలు పైగా నిమజ్జనం చేస్తారని ,ఈ సందర్భంగా ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ప్రజలు నిమజ్జనం చేసుకునే విధంగా పోలీస్ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామని ఎస్పీ తెలిపారు. అగ్నిమాపక విద్యుత్ రెవిన్యూ శాఖలతో సమన్వయం చేసుకొని అన్ని చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నిమజ్జనం చేసే ప్రాంతాలతో పాటు విగ్రహాలు ఊరేగింపు మొదలుకొని పూర్తి అయ్యేవరకు పోలీసులు తగిన భద్రత చర్యలు తీసుకుంటారన్నారు. ట్రాఫిక్ అంతరాయాలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని మోడల్ స్కూల్‌లోని ఆరవ, ఏడవ తరగతి విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 17వ తేదీన అనంతపురంలోని ఏజీఎస్ స్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలలో ప్రతిభ కనపరిచిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ పద్మశ్రీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతోపాటు యోగా, వివిధ రకాలైన క్రీడా పోటీలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని క్రీడల్లో కూడా జిల్లా రాష్ట్ర స్థాయిలలో విద్యార్థులు వెళ్లడం జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయి యోగా పోటీలు అక్టోబర్ 12వ తేదీ తూర్పుగోదావరి జిల్లా భీమవరంలో జరగనున్నాయని వారు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారిలో ఏడవ తరగతి విద్యార్థులు– పవన్ కుమార్, లాస్య, భువనేశ్వరి, దీప్తి, ఆరవ తరగతి విద్యార్థులు హుమేరాను ప్రిన్సిపల్‌తో పాటు పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

అవినీతి అధికారులపై చర్యలేవీ..?

ప్రజాశక్తి మడకశిర రూరల్

మడకశిర నియోజకవర్గంలో ఐదు మండలాల్లో ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతికి కారణమైన అధికారులపై చర్యలేవీ అని ఆయా మండలాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అవినీతికి పాల్పడ్డారన్న విషయంపై మడకశిర మండలంలో మొత్తం 8 మందికి మెమో జారీ చేశారు. అదే విధంగా ఇతర మండలాల్లో సైతం అధికారులకు మెమోలు జారీ చేశారు. ఇటీవల మండలంలో ఉపాధిక అధికారి చెక్ మెజర్మెంట్ చేయకపోవడంతో కూలీలకు వేతనాలు అందలేదు. దీంతో ఉపాధి పనులు తాత్కాలికంగా నిలిచిపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈనేపథ్యంలో బుధవారం మడకశిర ప్రాంతంలో ఉపాధి హామీ పీడీ పర్యటించనున్న నేపథ్యంలో ఈ అవినీతి అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్న చర్చ జరుగుతోంది.

నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూమకుంట పారిశ్రామిక వాడలో ఉన్నా రోల్‌వెల్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఒపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాసులు, ఒపిడిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే ఉపేంద్ర కుమార్ సమక్షంలో యూనియన్ నూతన కార్యవర్గాన్నిఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గంలో గౌరవాధ్యక్షులుగా సిఎ. రవికుమార్, అధ్యక్షులుగా బి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా రాఘవేంద్ర, బాలాజీ ప్రధాన కార్యదర్శిగా ఏ. హరీష్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా అబ్రార్, హనుమంత రాయుడు, ట్రెజరర్‌గా శ్రీరాములు, అడ్వైజర్లుగా ఒపిడిఆర్ శ్రీనివాసులు,ఉపేంద్ర కుమార్, టి .ఓబుల్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపికైన నూతన కార్యవర్గం రోల్‌వెల్ పరిశ్రమతో పాటు తూమకుంట, గోళపూరం పారిశ్రామిక వాడలో పని చేసే కార్మికుల హక్కుల సాధన కోసం పని చేస్తుందని చెప్పారు.

డంపింగ్‌యార్డులో విండో కంపోస్టింగ్

హిందూపురం : హిందూపురం రూరల్ మండలం వద్ద ఉన్నా మున్సిపల్ డంపింగ్ యార్డులో విండో కంపోస్టింగ్ నిర్వహించాలని ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులకు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆదేశించారు. మేరకు ఆయన మంగళవారం కంపోస్టు యార్డును ఎంఈ వెంకట రమణతో కలిసి పరిశీలించారు.

రాష్ట్రంలో పోలీస్ పాలన

◆ నియంతలా మారిన జగన్ ◆ రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నియంతలా మారి రాష్ట్రంలో పోలీస్ పాలన సాగిస్తున్నారని అఖిలపక్షం నాయకులు విమర్శించారు. మంగళవారం పట్టణంలోని సాయి ఆరామంలో 'ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలపై రాష్ట్రంలో కొనసాగుతున్న నిర్బంధాలు అరెస్టులు, అణచివేత'పై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, టిడిపి కన్వీనర్ రామాంజనేయులు, జనసేన జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. ప్రతిపక్షాలు ప్రజా సంఘాలను అణచివేయడమే ధ్యేయంగా జగన్ ఒక నియంతల వ్యవహరిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కి వేస్తూ అక్రమ అరెస్టులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. టిడిపి అధినేత చంద్రబాబును అక్రమ అరెస్టు ఇందులో భాగమే అన్నారు. 27 లక్షల దొంగ ఓట్లు నమోదు చేసి గెలవాలని వైసిపి చూస్తోందన్నారు. రాష్ట్రంలో ఇసుక, భూకబ్జా, మద్యం లాబీలు జరుగుతున్నాయన్నారు. మణిపూర్‌లో జరిగిన ధమనకాండపై ప్రధాని మోడీతో సహా బాధ్యత గల నాయకులు ఎవరూ స్పందించలేదన్నారు. ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాసంఘాల చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తే పోలీసులతో అణచి వేయిస్తూ దుర్మార్గపు సంస్కృతికి తెరతీస్తున్నారన్నారు. ఇలాంటి దమనకాండను ప్రతి ఒక్కరూ ఖండిస్తూ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ, శ్రీరామ్ రెడ్డి, జనసేన డాక్టర్ తిరుపతేంద్ర, సిఐటియు రైతు సంఘం నాయకులు బ్యాళ్ల అంజి, పైపల్లి గంగాధర్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కాటమయ్య, గంగాధర్, రమణ, ఎస్ఎఫ్ఐ పవన్, కుళ్లాయప్ప, మహిళా సమైక్య నుంచి పవిత్ర, లక్ష్మి, ఆదిలక్ష్మి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

అందరికీ తోడుగా సాదత్‌ఆలీఖాన్

◆ ఉచిత వివాహాలు.. పేద విద్యార్థుల విద్యకు విరాళాలు ◆ మసీదులు, ఆలయాల నిర్మాణాలకు చేయూత

పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న సాదత్‌ఆలీఖాన్

ప్రజాశక్తి-కదిరి టౌన్

పేద ప్రజలకు సేవ చేయాలనే తపనతో కదిరి నియోజకవర్గంకు చెందిన వైసిపి మైనార్టీ నాయకులు సాదత్ అలీఖాన్ ముందుకు సాగుతున్నాడు. ప్రజాభిమానం తోడు, ప్రజా సేవ చేస్తూ అన్ని వర్గాల్లోనూ మంచి పేరును సంపాదించుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో పలు విషయాలను పంచుకున్నాడు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక నవరత్నాలను ప్రవేశపెట్టి ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాల లబ్ధిని చేకూర్చారని చెప్పారు. తాను కూడా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి బాటలో పయనిస్తూ కదిరి నియోజకవర్గంలో విస్తతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2006 సంవత్సరంలో కదిరి పట్టణంలోని ఈద్గా మైదానంలో స్టాచ్యూ ఏర్పాటు చేశామన్నారు. 2012–13 సంవత్సరంలో పట్టణంలోని టైటానిక్ ఫంక్షన్ హాల్ సమీపాన తమ కుటుంబానికి చెందిన 25 సెంట్లు స్థలంలో మజీద్ ఏ రహమత్ పేరుతో మసీదును నిర్మించినట్లు చెప్పారు. కదిరి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పేద పిల్లల చదువుకు ఆర్థిక సాయం అందించామన్నారు. కరోనా సమయంలో పేదలకు నిత్యావసర సరుకులు, కూరగాయలను క్రమం తప్పకుండా ఇచ్చామన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటే వారికి వైద్య చికిత్సలు అందించామన్నారు. ఉచిత అంబులెన్స్‌ల ద్వారా వారిని వివిధ నగరాల్లోని ఆసుపత్రులకు పంపామన్నారు. రంజాన్, బక్రీద్‌లకు పేద ముస్లింలను గుర్తించి వారికి నిత్యావసర సరుకులు, వస్త్రాలు అందించే కార్యక్రమాన్ని ప్రతి ఏడాదీ నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఉచితంగా విద్యాసామగ్రిని అందిస్తున్నామన్నారు. ఉచిత ఖత్నా కార్యక్రమాలనూ నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులకు క్రీడా సామగ్రి, దుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. కదిరి నియోజవర్గం ప్రజలకు ప్రజాప్రతినిధిగా సేవ చేయాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని తాను రాజకీయాల్లోకి వచ్చాననితెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత సేవ చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు సాదత్‌ఆలీఖాన్ తెలియజేశారు.

ప్రతి అక్షరం - ప్రజా పక్షం
ప్రజాశక్తి దినపత్రిక విలేకర్లు కావలెను
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన మండల కేంద్రాల్లో విలేకర్లు కావలెను.
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన
-: విలేకరులు కావలసిన ప్రాంతం:- -: శ్రీ సత్యసాయి జిల్లా :-
తాడిమర్రి, రామగిరి, నల్లమాడ, అమడగూరు, రొళ్ల
పెనుకొండ రూరల్, ధర్మవరం రూరల్, హిందూపురం రూరల్
ఇంటర్వ్యూ : తేది 25-09-2023 సోమవారం ఉదయం 10 గంటలకు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు : 9490099311, 312, 313
ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం, అనంతపురం
D.No:42/2, Near Old VRL Godown, Ballari Road, Ananthapuramu-515001.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

కదిరి అర్బన్ : స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డిని ఆయన కార్యాలయంలో వైసిపి నల్లచెరువు మండల కన్వీనర్ హైదర్ వలి తదితరులు మంగళవారం కలిశారు. ఆయనతో పాటు పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ ఎం.నాగబయారెడ్డి తదితరులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో తమకు సముచిత స్థానం కల్పించినందుకు ఎమ్మెల్యేకు, సిఎం జగన్మోహన్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళ్యాణమండపం నిర్మాణానికి విరాళం

మడకశిర : నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండలం కాల్వేపల్లిలో నిర్మిస్తున్న లక్ష్మీ రంగనాథ స్వామి కళ్యాణ మండపం నిర్మాణానికి దాతలు రెండు లక్షల రూపాయలు విరాళం ప్రకటించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు రాజన్న, తిమ్మప్ప తెలిపారు, గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ పాండురంగప్ప కుమారుడు రమేష్ 50వేల రూపాయలు, అదేవిధంగా రంగప్ప కుమారుడు ఎస్ఆర్ రంగనాథ్ తమ కుటుంబం తరపున 50వేల రూపాయలు విరాళం అందించారు. అదే విధంగా కర్నాటకలోని సిరా తాలూకా లక్ష్మీ సాగర గ్రామానికి చెందిన శ్రీనివాస్ కుటుంబ సభ్యుల తరపున లక్ష వెయ్యి రూపాయలు తమ వంతుగా విరాళం ప్రకటించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు రమేష్, గోవిందప్ప. రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీకేంద్రం తనిఖీ

తలుపుల : మండల కేంద్రంలో 1వ అంగన్వాడీ కేంద్రాన్ని తహశీల్దార్ శ్రీధర్ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు, స్టాకుకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వో ముంతాజ్, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇర్ఫాన్

సోమందేపల్లి : మండల పరిధిలోని రంగేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారు కర్నూల్, నంద్యాల, అన్నమయ్య, చిత్తూరు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నుండి సుమారు 150 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేయగా సోమందేపల్లి మండలం నుండి ఇర్ఫాన్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక అయ్యారు. అనంతపురంలోని కెఎస్ఎన్ ఉమెన్స్ కళాశాల ఆవరణంలో సోమవారం జరిగిన సమావేశంలో ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ కు సంస్థ చైర్మన్ శ్యాముల్ రెడ్డి అవార్డు బహుకరించారు. అవార్డు రావడం తనకు సంతోషంగా ఉందని ఆయన తెలియజేశారు. పలువురు ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు ప్రిన్సిపల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

ఉపాధి పనుల పరిశీలన

నల్లచెరువు : మండల పరిధిలో జరిగిన ఉపాధి పనులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రామాంజనేయులు, ఎపిడి శివశంకర్ తదితరులు పరిశీలించారు. మొదటగా మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో వాన నీటిని నిల్వ చేయు కుంట పనిని పరిశీలించారు. ఉపాధిహామీ సిబ్బందికి తమ యొక్క విధి విధానాల గురించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శకుంతల, ఎపిఒ మంజుల, బాలునాయక్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రవికుమార్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ అనసూయ, గంగాధర్, ఫీల్డ్ అసిస్టెంట్లు బావాజీ, రామ్మోహన్ రైతులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ వేడుకల ప్రచార బైక్ జాతాను చేపడుతున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ నెల 21వ తేదీన శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో ఈజాతా ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ ప్రచార జాతాకు సంబంధించిన గోడ పత్రికలను వారు ఈసందర్భంగా విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ బైక్‌యాత్ర హిందూపురంలో ప్రారంభమై పెనుగొండ మీదుగా అనంతపురం పట్టణంలోనికి ప్రవేశిస్తుందన్నారుర. ఈనెల 21 గురువారం హిందూపురంలో ప్రారంభమయ్యే బైక్ జాతాలో జిల్లా వ్యాప్తంగా యుటిఎఫ్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ధర్మవరం జోన్ నాయకులు రామకృష్ణ నాయక్, లక్ష్మయ్య, రాంప్రసాద్, బి. రామాంజనేయులు, హెచ్. రామాంజనేయులు, సాయి గణేష్, గోపాల్ రెడ్డి, కుళ్లాయప్ప, సకల చంద్రశేఖర్, నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

మడకశిర : యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టే బైక్ జాతాను విజయవంతం చేయాలని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాలింగప్ప, వై.జోగప్ప, జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, కార్యదర్శి తాహీర్‌వలి తెలిపారు. ఈ మేరకు బైక్ జాత విజయవంతంపై సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్, సుదర్శన్, నరసింహమూర్తి, నంజప్ప, కదరన్న, వెంకటరమణ నాయక్ పాల్గొన్నారు.

చట్టాలను కాపాడుకుందాం

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ. నల్లప్ప

సదస్సులో మాట్లాడుతున్న ఓ. నల్లప్ప

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

దళిత ఉద్యోగ కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడి దళిత చట్టాలను కాపాడుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ నల్లప్ప పిలుపునిచ్చారు. శ్రీ సత్య సాయి జిల్లా పుట్టర్తిలో కెవిపిఎస్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దళితుల హక్కులు సామాజిక న్యాయంపై సదస్సును మంగళవారం నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అన్నమయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ నల్లప్ప, వ్యవసాయ కార్మిక సంఘం ఎం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ. నల్లప్ప మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు పూర్తి చేసుకున్న కుల వివక్ష అనేక రూపాల్లో విలయతాండవం చేస్తోందన్నారు. దళితుల చట్టాలను నీరుగార్చే పద్ధతిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్నాయని విమర్శించారు. దళితులు, దళిత సంఘాలు ప్రజా సంఘాలు ఉద్యోగ సంఘాలు ఐక్యంగా ఉద్యమించి దళిత చట్టాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను అమలు చేయాలన్నారు. డప్పు కళాకారులకు చర్మకారులకు 5వేల రూపాయలు పింఛను ఇవ్వాలని, శ్మశానంలో పనిచేసే కాటికాపర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి డిమాండ్లతో ఈ నెల 29వ తేదీ విజయవాడలో జరిగే మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంవి. రమణ నారాయణ, కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, రామాంజనేయులు, దళిత సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

ప్రాధాన్యత అంశాలపై అలసత్వం వహిస్తే చర్యలు

కలెక్టర్ అరుణ్ బాబు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రాధాన్యత అంశాలపై దృష్టి పెట్టాలని విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను హెచ్చరించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ తో పాటు డిఆర్ఓ కొండయ్య పాల్గొన్న సమావేశంలో వ్యవసాయ శాఖ, జగనన్నకు చెబుదాం, ఆరోగ్య సురక్ష, స్పందన, నాడు నేడు, జగనన్న పాల వెల్లువ, గృహ నిర్మాణం, ప్రాధాన్యత భవనాలు, ఉపాధి హామీ, స్వమిత్ర, గ్రామ వార్డు సచివాలయాలు, ఐసిడిఎస్ పనితీరు తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. అలాగే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను త్వరగతిన పూర్తి చేయాలన్నారు. పూర్తి అయిన భవనాలను ఆయా శాఖలకు అప్పగించాలన్నారు. రెవిన్యూ, పంచాయతీ, మునిసిపల్ తదితర శాఖలలో పెండింగ్ లో ఉన్న స్పందన అర్జీలు పరిష్కరించాలని ఆదేశించారు. వ్యవసాయానికి సంబంధించి పిఎం కిసాన్ ఆధార్ ఈ కేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈనెల 30న జగనన్న సురక్ష ప్రారంభమవుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు సమన్వయంతో వైద్య శిబిరాల ఏర్పాటుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంగనవాడీ కేంద్రాలలో బరువు తక్కువ పిల్లలందరినీ అక్టోబర్ 1న బరువు తీసి గుర్తించాలన్నారు. జిల్లాలో పలువురు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సిడిపిఒల పనితీరు బాగాలేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వారి పనితీరు మార్చుకోకపోతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు

ఇసుక అక్రమ తరలింపులో వాలంటీర్‌పై కేసు

పరిగి : మండలంలోని నేతులపల్లి పెన్నానది నుండి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న వాలంటీర్ ఓబులేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా పాల్పడినట్లు ఆయన తెలిపారు. స్థానికులు ఫిర్యాదు మేరకు పోలీసులు నదీ ప్రాంతానికి వెళ్లి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. అయితే ఈ ట్రాక్టర్‌ను ప్రభుత్వం రైతులకు వ్యవసాయ వంగడాల కోసం రైతుమిత్ర పథకం ద్వారా పంపిణీ చేసినదని స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పరిగి : మండల కేంద్రంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ సమీపంలోని మడకశిర రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. పరిగి నుండి హిందూపురం వైపుగా వెళ్తున్న కారు టైరు పంచరు కావడంతో ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని ఢీకొంది.ఈ ప్రమాదంలో రొద్దం మండలం లోచర్ల గ్రామానికి చెందిన మూర్తికి కాలు విరిగింది. మరో వ్యక్తి మహేష్ రెడ్డికి గాయాలయ్యాయి. 108 సాయంతో క్షతగాత్రులను హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

చిలమత్తూరు : మండల పరిధిలోని టేకులోడు క్రాస్ సమీపంలోని జగనన్న కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులకొట్టి రాగితీగలను ఎత్తుకెళ్లారు. ఈ మధ్య కాలంలో రైతులు పొలాల వద్ద ఏర్పాటు చేసిన స్టాటర్లు దొంగతనానికి గురయ్యాయి. తాజాగా ట్రాన్స్ ఫార్మర్లను దుండగులు దొంగలించడంతో రైతులు బెంబేలెత్తుత్తున్నారు.

ప్రహరీ నిర్మాణానికి సహకరించండి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం పరిదిలోని 1వ వార్డులో ఉన్న కోట్నూరు ముస్లీం స్మశాన వాటిక ప్రహరీ నిర్మాణం కోసం సహకరించాలని ఆ ప్రాంత ముస్లీం సోదరులు వైసిపి నాయకులు వేణు రెడ్డిని కోరారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయనను కలిసి సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ శివ శంకర్ రెడ్డి, మసీద్ కమిటీ సభ్యులు ముత్వవల్లి షఫీవుల్లా, అయూబ్, చాంద్ భాషా, రెహమాన్, సుహేల్, నౌషద్, నవీద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

ప్రజాశక్తి - బుక్కపట్నం

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పాముదుర్తి, గునిపల్లి. జానకంపల్లి తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. స్థానిక కోట వీధిలోని చిన్న మసీదు నందు ఏకదంతా యువత అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి వినాయక విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వినాయక విగ్రహాల వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, సర్పంచి నాగలక్ష్మి రాజు, ఎస్ఐ నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : పట్టణంలోనిసంగం థియేటర్ వెనక వీధిలో ఏర్పాటు చేసిన అయోధ్య రామ మందిరం ఇస్రో చంద్రయాన్ – 3 వినాయక విగ్రహం పట్టణ ప్రజలను ఆకర్షిస్తోంది. రిషిత చిన్న పిల్లల హాస్పిటల్ సిబ్బంది, వీధిలోని యువత కలిసి ఈ వినాయ విగ్రహానికి చంద్రయాన్ – 3 రాకెట్ ను తయారు చేశారు. పట్టణంలోని ప్రజలు చంద్రయాన్ని వినాయకుని చూడటానికి పోటీ పడుతున్నారు. చంద్రయాన్ వినాయకునికి తయారు చేయడానికి చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సి వి మదన కుమార్ సహకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.

తలుపుల : వినాయక చవితి పండుగను మండల వాసులు ఘనంగా జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకొని వినాయక విగ్రహాలను వాడవాడల ప్రతిష్టించి ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. మండలంలో దాదాపు 100 విగ్రహాలపైగా ప్రతిష్టించారు. స్థానిక ఎస్ఐ మక్బూల్ బాషా అన్ని వర్గాల ప్రజలతో శాంతి సమావేశాలు ఏర్పాటు చేసి ప్రశాంతంగా పండగ జరుపుకోవాలని సూచించడమే కాకుండా మండపాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని ప్రశాంతవాతావరణంలో జరుపుకోవాలని వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో మంగళవారం వినాయక కమిటీల నిర్వాహకులతో వన్ టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం, టూ టౌన్ ఎస్ఐ శేషగిరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐమాట్లాడుతూ గత ఏడాది ఎక్కడ నిజ్జనం చేశారో అక్కడే నిర్వహించుకోవాలన్నారు.

సోమందేపల్లి : మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకులను బుధవారం నిమజ్జనం చేయాలని మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వినాయకులను గురువారం నిమజ్జనం చేయాలని ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. మద్యం తాగి గొడవలు చేసి ఘర్షణలకు పాల్పడినా, మైనర్లచే వాహనాలు నడిపించిన, రాత్రి 10 గంటల తర్వాత మండపాల వద్ద శబ్ద కాలుష్యం చేసినా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి పట్టణంలో వినాయక చవితి సందర్భంగా వాడ వాడల వినాయక విగ్రహాలను ప్రతిష్టించారు. మంగళవారం ఈ సందర్భంగా పట్టణంలోని పలు వినాయక మండపాల దగ్గర అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గోకులంలోని ప్రధాన రహదారిలో ప్రతిష్టించిన వినాయకుడి దగ్గర గోకులం గ్రామ యాదవ నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూమిగాని రాజశేఖర్ యాదవ్, వెంకటేష్ యాదవ్, గంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణవాసులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు కనువిందు చేస్తున్నాయి. లింగిశెట్టిపాళ్యం, పీఆర్టీ, కొత్తపేట, రాంనగర్, శాంతినగర్, శివనగర్, దిగువగేరి, దుర్గానగర్, యాదవవీధి, లోనికోట, నేసేపేట, సాయినగర్, తేరుబజార్, ఆర్యవైశ్య కొత్తసత్రం, గాంధీనగర్, శివానగర్, లక్ష్మీనగర్, రైల్వేకాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

హిందూపురం : పురపాలక సంఘంలో ఆదివారం జరిగే గణేష నిమజ్జనం కోసం గుడ్డం కోనేరు వద్ద భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం గుడ్డం కోనేరును పరిశీలించారు. తగిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆధికారులకు సూచించారు.

మత విద్వేషాలు రేపుతున్న బిజెపి

ఆవాజ్ నాయకులు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలో మత విద్వేషాలను రేపుతోందని ఆవాజ్ నాయకులు విమర్శించారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆవాజ్ కమిటీ సమావేశం ముస్తాక్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మత విద్వేషాలు రెచ్చగొడుతూ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, మైనారిటీల పైన కులం మతాల పేరుతో దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న మత రాజకీయాలను ఎండగడుతూ ప్రజలను ఐక్యం చేస్తూ ఆవాజ్ పనిచేస్తుందన్నారు. అనంతరం కదిరి పట్టణ కమిటీని 13 మందితో ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా తాజుద్దీన్, కో కన్వీనర్‌గా ముస్తాక్ తో పాటు మరో 11 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చంద్రబాబు అరెస్టు కుట్రపూరితం : టిడిపి

ఢిల్లీలో జరిగిన మౌనదీక్షలో పాల్గొన్న బికె, తదితరులు

మడకశిరలో పోస్టల్ లెటర్లు చూపుతున్న నాయకులు

కదిరిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

చంద్రబాబు అరెస్టు కుట్ర పూరితమనిమాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని తిప్పా పట్లపల్లిలో టిడిపి నాయకులతో కలసి ఆయన మాట్లాడారు. చంద్రబాబు హయాంలో స్కిల్ డెవలప్మెంట్ కింద యువతకు శిక్షణ ఇవ్వడంతో ఎంతోమంది ఉద్యోగాలు వచ్చాయన్నారు. దురుద్దేశంతోనే వైసిపి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి ఆయనను జైలుకు పంపిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున భయభ్రాంతులకు గురి చేయడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాయకులు సప్లయర్స్ రామ్మోహన్, వెంకటరమణప్ప, శేషప్ప, గాజుల చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు

పాదయాత్ర : చంద్రబాబునాయుడు విడుదల చేయాలని టిడిపి నాయకులు కార్యకర్తలు మంగళవారం కొత్తచెరువు ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుండి పాదయాత్ర ప్రారంభించారు ఈ పాదయాత్ర మామిల్లికుంట క్రాస్ కప్పల బండ వెంకట గారి పల్లి క్రాస్ మారెమ్మ ఆలయం వరకు కొనసాగింది. ఈ పాదయాత్రకు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి వారికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు బోయ రాజు, లక్ష్మీనారాయణ, భైరవుడు, నల్లమాడ శంకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

మౌనదీక్షలో పాల్గొన్న బికె..

పెనుకొండ : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా రాజ్‌ఘాట్ లోని మహాత్మా గాంధీ సమాధి వద్ద చేపట్టిన మౌనదీక్షల్లో పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బికె. పార్థసారథి పాల్గొన్నారు. ఈ మేరకు ఆయన నారా లోకేష్ తో కలసి నల్ల బ్యాడ్జీలు ధరించి మౌన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ సభ్యులు, మాజీ ఎంపీ, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కె.పార్థసారథి ఆదేశాల మేరకు మంగళవారం బాబుతో నేను కార్యక్రమాన్ని తెలుగు మహిళలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మండలాలకు చెందిన తెలుగు మహిళలు 7వ రోజు సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు.

నిరసన తెలిపితే అరెస్టు చేస్తారా.. ? : పరిటాల

ధర్మవరం టౌన్ : చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలపడానికి వెళుతుంటే అరెస్టులు చేస్తారా.. అని మాజీ మంత్రి పరిటాల సునీత, తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మవరం పట్టణంలో పోలీసులు మాజీ మంత్రి పరిటాలసునీతను అడ్డుకున్న సం ఘటనతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ కదిరిపట్టణంలో యాత్ర చేపట్టారని, ఈ యాత్రలో ఉమ్మడిజిల్లా నాయకులు పాల్గొనాలని భావించారు. దీంతో వెంకటాపురంనుండి మాజీ మంత్రి పరిటాల సునీత వెళ్తుండగా ధర్మవరంలోని శ్రీలక్ష్మీ చెన్న కేశవపురంలో పోలీసులు అడ్డుకున్నారు. కదిరికి వెళ్లడానికి అనుమతులు లేవని వెళ్లరాదని పరిటాల సునీతను నిలిపివేశారు. దీంతో పరిటాలసునీత పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పోలీసులకు, టీడీపీ నాయకులకు వాగ్వావాదం జరిగింది. ఆమెను బలవంతంగా వాహనంలో ఎక్కించి ధర్మవరం పట్టణంలోని టీడీపీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్ష శిబిరం వద్దకు తీసుకువచ్చారు. దీంతో దీక్ష చేపడుతున్న 40 వార్డుల టీడీపీ ఇన్చార్జులు, టీడీపీ నాయకులతో కలసి పరిటాల సునీత రోడ్డుపై బైటాయించారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కల్గడంతో పోలీసులకు. టీడీపీ నాయకులకు వాగ్వావాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి దీక్షా శిబిరం వద్దకు చేరుకుని మద్దతు తెలిపారు. ఈసందర్భంగా పరిటాలసునీత, చిలకం మధుసూదన్‌రెడ్డి టీడీపీ శ్రేణులతో కలిసి శిబిరం వద్ద నుండి ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు ర్యాలీగా చేరుకుని అక్కడ ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ మనం ఏ రాజ్యాంలో ఉన్నామో అర్థంకాలేదన్నారు. ప్రతిపక్షాలు రోడ్డు ఎక్కగానే అరెస్టులు చేయమని సీఎం జగన్‌రెడ్డి చెప్పారా అంటూ పోలీసులను ప్రశ్నించారు. ఈ రాష్ట్రం ఏమైనా జగన్‌రెడ్డికి రాసిచ్చిన జాగీరా అంటూ మండిపడ్డారు. చిలకం మాట్లాడుతూ... ప్రతిపక్ష పార్టీలు కనీసం నిరసన కార్యక్రమాలు చేయనివ్వకుండా పోలీసుల ద్వారా ఈ ప్రభుత్వం అడ్డుపడుతోందన్నారు. రాష్ట్రంలో రాజారెడ్డి పాలను సాగుతోందని, ఇది ఎంతో కాలం సాగదని, త్వరలో వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలే గద్దె దించుతారని అన్నారు.

జైలర్‌కు పోస్టల్ లెటర్లు

మడకశిర నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలో భాగంగా స్థానిక నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అక్రమ కేసు కొట్టివేయాలని పోస్టల్ లెటర్లు రాసి రాజమండ్రి జైలు సూపరింటెండెంట్‌కు పంపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి చంద్రప్ప, సత్య సాయి జిల్లా మైనార్టీ అధ్యక్షుడు భక్తర్ సాబ్, మండల నాయకులు లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు మనోహర్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు కల్లు మర్రి నాగరాజు, రిటైర్డ్ ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ మల్లికార్జున, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వినూత్న నిరసన

ఓబుళదేవరచెరువు : చంద్రబాబు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మోకాలు మీద కూర్చొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేని స్కిల్ డెవలప్మెంట్ కేసులో అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. దీనికి తగిన గుణపాఠం చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జయచంద్ర, టిఎన్‌టియుసి నియోజకవర్గ అధ్యక్షులు నిజాంవలి, తెలుగు యువత అధ్యక్షులు బి ఓబుల్ రెడ్డి, మీ సేవ సుధాకర్, టిఎన్‌టియుసి మండల అధ్యక్షులు చాంద్‌బాషా, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, గ్రామ కమిటీ అధ్యక్షులు సౌదీ నాగరాజు, మైనార్టీ నాయకులు పి షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు .

అడ్డుకున్న పోలీసులు

నల్లచెరువు : కదిరిలో కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్రలో పాల్గొనకుండా తనకల్లు టిడిపి నాయకులను నల్లచెరువు పోలీసులు అడ్డుకున్నారు. దీంతో నాయకులు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ విషయంపై కొద్దిసేపు పోలీసులకు నాయకులకు వాగ్వావాదం చోటు చేసుకుంది. అనంతరం నాయకులను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు కావడి ప్రవీణ్ కుమార్, పిజి. మల్లికార్జున, తాజుఖాన్, జల్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

నియంత పై పోరాడుదాం

హిందూపురం : రాష్ట్రంలో నియంతలా వ్యవహరిస్తున్న సిఎంపై పోరాటం చేయడమే కాకుండా చంద్రబాబుకు అండగా ఉంటామని టిడిపి నాయకులు, బాలకృష్ణ అభిమానులు అన్నారు. చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా పట్టణంలోని నాలుగు సింహాల ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల అర్పించి నివాళులర్పించారు. అనంతరం కళ్ళకు గంతలు కట్టుకొని, మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజక వర్గ కో ఆర్డినేటర్ శ్రీనివాస రావు, బాలకృష్ణ అభిమాన సంఘం జాతీయ కన్వీనర్ సతీష్ కుమార్, నాయకులు రాము, రమేష్ కుమార్, అమర్నాథ్, నడబిరసూల్, రమేష్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

7వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి టిడిపి కార్యాలయంలో నిర్వహిస్తున్న రిలేదీక్షలు మంగళవారానికి 7వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని టిడిపికార్యాలయంలో పట్టణ కన్వీనర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్, తెలుగు మహిళా నాయకురాలు ఈ దీక్షలో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి శ్రీరామ్ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి భూమయ్య, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్, నాయకులు శ్రీనివాసులు, నరేష్ కుమార్ యాదవ్, సురేంద్ర యాదవ్, సుధాకర్, మాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం

మడకశిర : రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోందని టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి బిఎస్. గురుమూర్తి, మండల కన్వీనర్ దాసిరెడ్డి ఆరోపించారు. ఈ మేరకు వారు మంగళవారం స్థానిక విలేకరులతో సమావేశమయ్యారు. నాలుగున్నర సంవత్సరాల వైసీపీ ప్రభుత్వ పాలనలో జగన్ రెడ్డి పిచ్చి నిర్ణయాలవల్ల రాష్ట్రం అధోగతికి చేరుకుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కార్మికులందరు ఏకమై వైసిపిని గద్దె దించాలని పిలుపునిచ్చారు. బాబు అరెస్టుతో జగన్ రెడ్డి తనగోతిని తానే తవ్వుకొన్నాడని అన్నారు. ఎన్నికలు ఎపుడూ వచ్చినా జగన్‌కు రాజకీయ సమాధి కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా దాదాపు 500 మంది నాయకులు రాజమహేంద్రవరం జైలులో ఉన్న చంద్రబాబుకు మద్దతుగా లేఖలు రాసి రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి ఈరన్న, క్లస్టర్ ఇన్‌ఛార్జి భరత్, తెలుగుయువత అధ్యక్షులు బాలకృష్ణ, టిఎన్‌టియుసి జిల్లా ఉపాధ్యక్షులు సిఎన్. మూర్తి, మాజీ ఎంపీపీలు కిట్టప్ప, పాండురంగప్ప, సిద్ధగంగప్ప, నరసింహప్ప, సీనియర్ నాయకులు శ్రీరంగప్ప, లక్ష్మీనరసప్ప, రాజకుమార్, హనుమంతరాయ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కక్షపూరిత విధానాలే లక్ష్యంగా అధికార పార్టీ పనిచేస్తుందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ కదిరి పట్టణంలో కందికుంట ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ బహిరంగ ర్యాలీ నిర్వహించారు: ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు కార్యకర్తలు వేలాదిగా పాల్గొని సీఎం జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కందికుంట మాట్లాడుతూ వైసిపి ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తుందని. ఇలాంటి తాటాకు చప్పులకు భయపడే ప్రసక్తి లేదని అన్నారు. జగన్మోహన్ రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ , నాయకులు, కృష్ణమోహన్ నాయుడు, రాజశేఖర్ బాబు, మోపురిశెట్టి చంద్రశేఖర , గంగయ్య నాయుడు, బంగారు కృష్ణమూర్తి, మాజీ మహిళా కమిషన్ సభ్యురాలు పర్వీన్ భాను, డైమండ్ ఇర్ఫాన్ ,కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు,